సమస్యల కేంద్రాలు

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు
- బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ
- ప్రజలకూ తప్పని పాట్లు

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే.. సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ప్రధాన కార్యాలయాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకట్రెండు భవనాలు అసౌకర్యాల నడుమ మగ్గుతున్నాయి. దీంతో అక్కడకు వెళ్లే ప్రజలకు కూడా ఇక్కట్లు తప్పడం లేదు.



శిథిలావస్థకు చేరడంతో ఖాళీగా వదిలేసిన తహసీల్దార్ కార్యాలయం

కొడవలూరు : మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే ఇది పూర్తిస్థాయిలో శిథిలావస్థలో ఉంది. పెచ్చులూడి పడుతూ అధికారులకు ప్రాణాపాయంగా మారడంతో పరిస్థితి తీవ్రతను గుర్తించిన అప్పటి ఆర్డీఓ పాత ఇరిగేషన్ అతిథి గృహ భవనంలోకి మార్పించారు. కానీ ఈ భవనం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పూర్తిగా శిథిలమై పాములకు ఆవాసంగా మారిన భవనానికి పైపై రంగులు వేసి తహసీల్దార్ కార్యాలయంగా మార్చారు. ఈ భవనం బ్రిటీష్ కాలంలో నిర్మించినది కావడంతో ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు.

చినుకు పడితే..


ఉరుస్తున్న ఎంపీడీఓ కార్యాలయం

మండలానికి మరో ప్రధానమైనది ఎంపీడీఓ కార్యాలయం. అయితే ఇది కూడా శిథిలావస్థలోనే ఉంది. ఈ భవనానికి ఇప్పటికే రెండు పర్యాయాలు మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ చినుకు పడితే కార్యాలయం ఉరుస్తుండడంతో కాలు మోపలేని పరిస్థితి నెలకొంటోంది.

శ్మశానంలో పశువైద్యశాల


శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

కొడవలూరులోని పశువైద్యశాలను శ్మశానంలో నిర్మించారు. దీనికితోడు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో మందులు సైతం తడిసిపోతుండడంతో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇది శ్మశానంలో ఉండడంతో ఇక్కడ అంత్యక్రియలు, కర్మకాండలు జరిగితే ఆస్పత్రిని మూసి వేయాల్సి వస్తోంది. ఇక్కడ పిచ్చి మొక్కలు, కత్రతుమ్మ దట్టంగా పెరిగి ఉండడంతో విష సర్పాలు ఆస్పత్రిలోకి చొచ్చుకురావడం మామూలేనని, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది బహాటంగా చెబుతున్నారు.

వ్యవసాయానికి సొంతింటి గ్రహణం


1994లో కొంత నిర్మించి వదిలేసిన వ్యవసాయ శాఖ కార్యాలయం


2018లో మరో భవనాన్ని పూర్తి చేసి తుది మెరుగులద్దకుండా వదిలేసిన వైనం

మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి గ్రహణం పట్టింది. 1994లో స్థానిక పీహెచ్‌సీ పక్కనే వ్యవసాయ కార్యాలయానికి సగం మేర భవనం నిర్మించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదన్న నెపంతో నిలిపివేశారు. అది అలాగే ఉండిపోగా 2018లో టీడీపీ ప్రభుత్వం ఎంపీడీఓ కార్యాలయానికి పక్కనే మరో కొత్త భవనాన్ని నిర్మించారు. ఈ భవనం పూర్తయినప్పటికీ నిధులు సరిపోలేదన్న కారణంగా మరుగుదొడ్లు, నీటి ట్యాంక్, విద్యుత్ సరఫరా, ఫ్లోరింగ్ లాంటి పనులు పూర్తి కాలేదు. అందుకు ఇంకొంత నిధులు కేటాయిస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పినప్పటికీ అమలుకు నోచుకోక ఆ భవనం కూడా అలాగే ఉండిపోయింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ గదిలో అసౌకర్యాల నడుమ నడుస్తోంది.

గుంతలో సమాఖ్య కార్యాలయం


నెల రోజులైనా తొలగని వర్షపునీరు

నిత్యం మహిళలతో రద్దీగా ఉండే సంఘమిత్ర మండల సమాఖ్య కార్యాలయాన్ని మెయిన్ రోడ్డు పక్కన నాలుగు అడుగుల పల్లంలో నిర్మించారు. దీంతో వర్షం పడితే నెల రోజుల పాటు కార్యాలయంలోకి వెళ్లలేకపోతున్నారు. కార్యాలయం ముందు భాగంలో మట్టి తోలి ఎత్తు పెంచితే సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఆ దిశగా ఎవరూ యత్నించడం లేదు.


శిథిల అతిథి గృహంలో నడుస్తున్న తహసీల్దార్ కార్యాలయం

కార్యాలయాలు సౌకర్యవంతంగా ఉండాలి



ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వివిధ అవసరాలతో ప్రజలు వస్తుంటారు. అందువల్ల వీటిని సౌకర్యవంతంగా ఉండేలా చూడాలి. అధికారులు, సిబ్బందే బిక్కు బిక్కు మంటూ విధులు నిర్వహిస్తుంటే ప్రజల సమస్యలపై ఏ మేర దృష్టి సారిస్తారన్నది సందేహమే. ప్రజాప్రతినిధులైనా స్పందించి కార్యాలయాలను సౌకర్యవంతంగా ఉండేలా చూడాలి.
– కొడవలూరు మోహన్‌రావు, రిటైర్డ్ వీఆర్వో, నార్తురాజుపాళెం

వెసులుబాటున్నా.. పట్టడం లేదు



వ్యవసాయశాఖ, సంఘమిత్ర కార్యాలయాలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. ఇక్కడ ఉన్న సమస్యను తక్కువ ఖర్చుతోనే పరిష్కరించవచ్చు. కానీ ఎందుకో జాప్యం చేస్తున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయాన్ని నిర్మించి తుది మెరుగులద్దకుండా వదిలేశారు. అదేవిధంగా సంఘమిత్ర కార్యాలయం ముందు మట్టితోలితే సమస్య పరిష్కారమవుతుంది. తక్కువ ఖర్చుతో కూడుకున్న పనులను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.
– పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్, పెయ్యలపాళెం, కొడవలూరు మండలం

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో గణిత దినోత్సవం



విడవలూరు : స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత అధ్యాపకుడు డి.ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. గణితశాస్త్ర అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఆమె వివరించారు. డీఎఫ్ఏపీ కో–ఆర్డినేటర్ ఏవీ ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ..


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పొదలకూరు: పట్టణంలో వివిధ సమస్యలని పరిష్కరించాలంటూ బీజేపీ మండల నాయకులు సోమవారం ఎంపీడీఓ డీవీ నరసింహారావుకు స్థానిక కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్లు బాగు చేయించాలని, వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో చింతగింజల చినసుబ్రహ్మణ్యం, ఆర్.ధనుంజయరావు, పూల ప్రశాంత్ తదితరులున్నారు.

జిల్లాలో ఎరువుల కొరత


మాట్లాడుతున్న శ్రీనివాసులు

మనుబోలు: జిల్లాలో ఎరువుల కొరత కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీజేపీ జిల్లా నాయకుడు బోలా శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా ఇప్పటికీ జిల్లాలో యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉందన్నారు. వరి నాట్లు వేశాక నిర్ణీత వ్యవధిలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. చాలాచోట్ల యూరియాను బ్లాక్ మార్కెట్లకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు తెలిసిందన్నారు.

రైటర్‌తోపులో 'ఫ్యామిలీ డాక్టర్'



హాజరైన వైద్య బృందం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం రైటర్‌తోపులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను ఇవ్వడంతో పాటు వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా యల్లాయపాళెం వైద్యాధికారి కావ్య మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఏ సుధాకర్, ఏఎన్ఎం సలోమి పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


మనుబోలు: ప్రత్యేకాలంకరణలో కామాక్షితాయి

మనుబోలు: మండల పరిధిలోని కండలేరు ఒడ్డున ఉన్న కామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు సాయికుమార్ శర్మ పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా లక్ష్మీప్రసాద్ – స్వర్ణలత దంపతులు వ్యవహరించారు.

➡ **పొదలకూరు:** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ప్రహరీ కూల్చిన వారిపై చర్యలకు డిమాండ్


ప్రహరీని కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ కూల్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రత్నం డిమాండ్ చేశారు. సోమవారం వారు పాఠశాల వద్దకు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోడతోపాటు వాటర్ ట్యాంక్‌ను పగులగొట్టడం వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే కలెక్టర్, డీఈఓ స్పందించి గోడను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. వారి వెంట నరసింహులు తదితరులున్నారు.

నేటి నుంచి కోడూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


క్రిస్మస్ వేడుకులకు సిద్ధమైన చర్చి


నేలటూరులో చర్చి

తోటపల్లిగూడూరు: క్రిస్మస్ సందర్భంగా మంగళ, బుధవారాల్లో మండలంలోని కోడూరు వేళాంగణి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. 1980లో సింహపురి బిషప్ పూదోట బాలస్వామి చేతుల మీదుగా కోడూరు సాగర తీరాన చర్చి ప్రారంభమైంది. అప్పటి నుంచి మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతోంది. ప్రతి ఆదివారం జరిగే ప్రత్యేక ప్రార్థనలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. సమీపంలోనే సముద్రం ఉండడంతో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ఉంది. చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకస్‌రాజ్ మాట్లాడుతూ రెండురోజులపాటు ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తుల కోసం వసతులు కల్పించామన్నారు.

➡ మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రీ క్రిస్మస్ సంబరాలు జరిగాయి. టీచర్లు కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ అహ్మద్‌బాషా, ఎస్ఎంసీ చైర్మన్ సువార్త, వైస్ చైర్మన్ గిరిజాకుమారి, టీచర్లు వసంతలక్ష్మి, కృష్ణవేణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

➡ **ముత్తుకూరు:** క్రిస్మస్ వేడుకలకు మండలంలోని క్రీస్తు ప్రార్థనా మందిరాలను ముస్తాబు చేస్తున్నారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. ముత్తుకూరు, నేలటూరు, పిడతాపోలూరు, పంటపాళెం, వల్లూరు, గోపాలపురం తదితర గ్రామాల్లోని మందిరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.


సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకలు

డీఎంహెచ్ఓను కలిసిన నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకట్రావు తదితరులు

కొడవలూరు: డీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుజాతను జిల్లా హెల్త్ అసిస్టెంట్ల సంఘం నేతలు సోమవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు ఎ.వెంకట్రావు, సభ్యులు షఫీ ఉద్దీన్, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాల రైతుల నుంచి తహసీల్దార్ బి.శివకృష్ణ వినతులు స్వీకరించారు. పాస్ పుస్తకాలు, పొలం వివాదాలు, భూముల కొలతలు తదితర సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత వీఆర్వోలను తహసీల్దార్ ఆదేశించారు.

➡ **బుచ్చిరెడ్డిపాళెం:** ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ కోరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో ఆమె సోమవారం అర్జీలు స్వీకరించారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కృష్ణమోహన్ పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.


మోర్ల సుప్రజకు వినతిపత్రం అందజేత

➡ బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇందులో ఇద్దరు మాత్రమే వినతిపత్రాలు అందజేశారని తహసీల్దార్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. అవి భూ సర్వేకు సంబంధించిన సమస్యలని ఆయన పేర్కొన్నారు.

వే బ్రిడ్జి వద్దంటూ ఆందోళన

పొదలకూరు: పట్టణంలోని మనుబోలు – పొదలకూరు మార్గం నిమ్మ మార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న వే బ్రిడ్జి వద్దని కొందరు స్థానికులు సోమవారం ఆందోళన నిర్వహించారు. దాని వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తొలగించాలని డిమాండ్ చేశారు.

గీతాంజలిలో వ్యాసరచన పోటీలు

కోవూరు: గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్, గుడ్ టచ్– బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఫ్రీ లీగల్ ఎయిడ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యుడు సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

పొదలకూరు: రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు రెవెన్యూ సదస్సును నిర్వహిస్తామని తహసీల్దార్ శివకృష్ణ సోమవారం తెలిపారు. సమస్యలున్న వారు వినతిపత్రాలను అందజేయాల్సిందిగా సూచించారు.

యూరియా లేక.. అన్నదాతల అవస్థలు


యూరియా కోసం బారులు తీరిన రైతులు

బుచ్చిరెడ్డిపాళెం: యూరియా కొరత లేదని సమృద్ధిగా స్టాక్ ఉందంటూ అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలేనని తేలిపోయింది. బుచ్చిరెడ్డిపాళెంలోని సహకార సంఘాల్లో ఐదురోజుల నుంచి యూరియా కొరత తీవ్రంగా ఉంది. దీనిపై పత్రికల్లో వార్తలు రావడంతో శనివారం అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు బుచ్చిరెడ్డిపాళెం వచ్చి యూరియా సమృద్ధిగా ఉందని, అందరికీ అందిస్తామని ప్రకటించారు. అయితే సోమవారం నాటికి అయిపోయిందంటూ బోర్డులు తిప్పేయడంతో రైతులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పట్టణంలో ఉన్న గ్రోమోర్ అవుట్‌లెట్ దుకాణానికి బారులు తీరారు. అక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. గత ప్రభుత్వం తమకు ఆర్‌బీకేల ద్వారా ఎరువులను సరఫరా చేసిందని, కూటమి ప్రభుత్వంలో ప్రతి పనికీ అవస్థలు పడుతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కోవెరపాళెంలో ఉచిత వైద్య శిబిరం



తోటపల్లిగూడూరు: మండలంలోని కోవెరపాళెం గ్రామంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రశాంత్, సుమంత్, అనూబ్‌బాబు, మహితాశ్రీ, సాయికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి సేవలో దర్శకుడు కోదండరామిరెడ్డి


కుటుంబసభ్యులతో కోదండరామిరెడ్డి

ఇందుకూరుపేట: ప్రముఖ సినీ దర్శకుడు కోదండరామిరెడ్డి, ఆయన తనయులు వైభవ్, సునీల్, ఇతర కుటుంబసభ్యులు గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వగ్రామం గంగపట్నంలోని బంధువులు, స్నేహితులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మేనల్లుడు వేణుంబాక మహీధర్ రెడ్డి నివాసంలో కొంతసేపు సేదతీరారు. కాగా కోదండరామిరెడ్డి ఖైదీ, అభిలాష, విజేత, పసివాడి ప్రాణం, కొండవీటి దొంగతోపాటు అనేక హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డుల పరిశీలన

కోవూరు: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయ శాఖ ఏడీ సుజాత, ఏఓ అనిత తనిఖీ చేశారు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని వారు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో అన్నదాతలకు సూచనలిస్తున్నామన్నారు. అధికారుల సిఫార్సు మేరకు రైతులు ఎరువులను వినియోగించాలని సూచించారు.